**లోకం ఎన్నిరకాలు .... కడుపు నిండా తిండి సంపాదించుకుం టున్న వాణ్ణి స్వార్థపరుడు అంటుంది! కడుపు నిండా తిండి సంపాదించుకోలేని వాణ్ణి చేతకాని వాడు అంటుంది!!**

# లోకంతీరు

— జయ



కాలం పరిగెడుతోంది. అందులో వింతేమీ లేదు. చాలా సహజం. అలాగే కాలంతోపాటు నా వయసు పెరుగుతోంది. రేపు ఫిబ్రవరి పద్నాలుక్కి నా పెళ్ళయ్యి పదహారు సంవత్సరాలు అవుతుంది. జీవితంలో ఎటువంటి మార్పూలేదు. ఆయన తెల్లబడుతున్న జుట్టుకి రంగేసుకుంటూ ఏదో పాపం తాపత్రయ పడుతున్నారు. నేను చదివిన తెలుగు నవలలనే మళ్ళీ మళ్ళీ చదువుతున్నాను. మేమిద్దరం యిదివరకు చెప్పుకున్న ఫలానా విషయాలే తిరిగి తిరిగి చెప్పుకుంటున్నాం. జీవితంలో ఎటువంటి కదలిక లేదు. "అబ్బ జీవితం బోరుగా వుంది" అని ఇదివరలో ఎవరయినా అంటే నవ్వేదాన్ని. ఇప్పుడు నేను యించుమించు సగం పిచ్చిదానిగా మారటానికి ఈ బోరే కారణం.

స్వతహాగా నేను మిత భాషిని. ఎక్కువగా ఎవరితోనూ మాట్లాడను. కలివిడిగా వుండలేను. బాగా తెలుసున్న వాళ్ళతో కూడా మాట్లాడటానికి మాటల్ని ఏరుకుంటూ వుంటాను. అయితే నా జీవితంలా పెళ్ళయిన అందరు స్త్రీల జీవితాలూ యిలా కదలిక లేని నీరులా వున్నాయా? వాళ్ళ బుర్రలు కూడా అర్థంలేని ఆలోచనల బురదలో కూరుకుపోయి వున్నాయా? అలాంటి ప్రశ్నలకి జవాబుల కోసం నాకు తెలిసున్న ప్రతీ గృహిణి జీవితం గమనించాను. నా బోరుకి, మానసిక అస్థిరతకి కారణం పిల్లలు. పెళ్ళయి పదహారు సంవత్సరా లవుతున్నా పిల్లలు పుట్టకపోవటం నా జీవితానికి పెద్దలోటు, తీరని వెత్తి.

పిల్లలు పుట్టరని నిర్ధారణ చేసుకున్నాక, ఎవరి నన్నా పెంచుకుంటే బావుణ్ను అని అనుకున్నాను. నిజానికి మా వంశంలో పిల్లలు తక్కువ. మా అమ్మ నాన్నలకి నేనొక్కదాన్నే. మా పిన్నికి పిల్లలు లేరు. మావయ్యకి ఒకడు పుట్టి ఆ తర్వాత ఏదో జబ్బుచేసి పోయాడు. ఇక ఆయన తరఫు వారిలో కుటుంబ నియంత్రణ పుణ్యమా అని అందరికీ ఒకరు లేక యిద్దరు వున్నారు. దూరపు బంధువుల పిల్లల గురించి భోగట్టా చేసినా లాభం లేక పోయింది.

"అనాథ పిల్లనెవర్నన్నా తెచ్చుకుని పెంచు కుందాం" అని ఆయన దగ్గరంటే, ఆయన కళ్ళెర్ర చేసి "నీకు వెళ్ళేకొద్దీ పిచ్చి ముదిరిపోతోంది. అలాంటి పిచ్చి ఆలోచనలు పెట్టుకోకు" అనేశారు గట్టిగా. అంత ఘట్టిగా ఆయన అరిచాక మళ్ళీ ఆ విషయం ఎత్తే ధైర్యం లేక పూరుకున్నాను.

మా పక్క వాటాలోకి ఎవరో కొత్తగా అద్దెకి దిగారు. ఇలాంటి విషయాలు నేను పెద్దగా పట్టించుకోను. "ఎవరో వస్తారు. వెళ్ళిపోతారు" అనే ఫిలసాఫికల్ ఐడియా ఒకటి వుంది నాలో. నిజానికి మనుషులంటే నిర్లక్ష్యం, వాళ్ళపట్ల స్నేహంగా వుండలేక పోవటానికి నా బాల్యం కారణం. తర్వాత స్కూలు జీవితంలో కాలేజీ జీవితంలో నేను మంచి స్నేహితులుగా నమ్మిన వాళ్ళు ద్రోహులుగా, గోతులు తీసే రకాలుగా ఋజువవటంతో నాకు మనుషుల మీద అదోరక మయిన నిర్లక్ష్యం పెరిగింది. గబుక్కున మనుషుల్ని నమ్మి, వాళ్ళతో స్నేహం పెంచుకోక పోవటానికి కారణం అనుభవాల ద్వారా నేను నేర్చుకున్న పాఠాలు!

అయితే పక్కవాటాలో దిగిన దంపతులకి

ముద్దులొలికే ఒక చిన్నారి పాప వుంది. అది బుల్లి బుల్లి అడుగులేసుకుంటూ, బాలన్స్ తప్పి క్రింద కూర్చోబడటం, మళ్ళీ బోసినవ్వులు నవ్వేస్తూ లేచి నిల్చోవటం, వాళ్ళ అమ్మా నాన్నా వచ్చినప్పుడు చేతులు చాస్తూ ఏదో ముద్దయిన భాష మాట్లాడటం .... యిలాంటి అద్భుత దృశ్యా లెన్నిటినో నేను కిటికీలోంచి వరండాలోకి చూస్తూ గమనించాను. నాకు తెలీకుండానే నేను ఆ పాపకు దగ్గరయిపోయాను.

నా చుట్టూ పేరుకుపోయిన నిశ్శబ్దాన్ని చీల్చేస్తూ పాప నా జీవితంలోకి వచ్చేసింది. రోజూ ప్రొద్దుట్నించి సాయింత్రం వరకు అదే లోకం అయిపోయింది. నాలో కదలిక. నా జీవితంలో మార్పు వచ్చింది. ప్రతి రోజూ సాయంత్రం పాపని తీసుకుని పార్క్‌కో, బజారుకో వెళ్ళటం దానికేదన్నా కొని పెట్టటం నాకు ఇష్టమైన దినచర్యగా మారింది.

ఆఖరికి పాప నాకెంత దగ్గరయ్యిందంటే వాళ్ళమ్మ వచ్చి "రామ్మా బువ్వ తిందువుగాని" అని పిల్చినా "లాను" అంటూ నా ఒళ్లో దూరిపోయేది. పైగా నన్నే "అమ్మా" అంటూ పిలవడం మొదలెట్టింది. ఇది నాకు సంతోషం కల్గించినా, తల్లి మనసు మాత్రం పాపలో యిటువంటి మార్పు రావటం యిష్టపడదని గ్రహించలేక పోయాను. నేను పాపని తననుంచి లాగేసుకుంటున్నట్లు నేనో శత్రువులా పాప తల్లి మనసులో మిగిలిపోతానని తెలుసుకోలేకపోయాను.

ఒకరోజు పాప కోసం వాళ్ళ వాటాలోకి వెళ్ళబోయి, లోపల ఎవరో వున్నారని గ్రహించి వెను దిరిగాను. అప్పుడే పాపతల్లి "గొడ్రాలి చేతుల్లో పిల్లలు పడితే అంతేనంటే మీరు చెప్పినట్టు. ఈ మధ్య మా పాప బొత్తిగా పాడయిపోయిందండి. ఇదివరకు యింకా మాంచి గులాబీ రంగులో వుండి, కాళ్ళు చేతులు బొద్దుగా యింతంత లావుండేవనుకోండి" అంటోంది.

జీవితంలో నేను గొడ్రాలిగా పేర్కొనబడడం అదే మొదటిసారి. చాలా సంవత్సరాల తర్వాత నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. తిరిగి నా చుట్టూ నిశ్శబ్దం ఆవరించుకుంది. మనుషుల మీద ప్రేమ, నమ్మకం పెంచుకోవటం ఎంత బుద్ధితక్కువో మళ్ళీ ఓసారి అర్థమయింది. కాని యిదివరకటిలా నెమ్మదిగా, బోరుని భరిస్తూ ఆ యింట్లో వుండటం నావల్ల కాలేదు. పట్టుబట్టి యిల్లు మార్పించాను!

❋


ఇప్పుడు నాలో మరింత జడత్వం పేరుకుపోయింది. అదివరకు ఎదురింటి వాళ్ళుగాని, పక్కింటి వాళ్ళుగాని చూసి పలకరింపుగా నవ్వితే తిరిగి నవ్వేదాన్ని. కాని పాపతల్లి ప్రవర్తన నాలో మిగిలివున్న స్నేహతత్వాన్ని విరిచేసింది. ఇప్పుడు ఎవరయినా పలకరింపుగా నవ్వితే తల తిప్పుకుని నన్ను కాదన్నట్లుగా వచ్చేస్తున్నాను.

ఒకరోజు కూరగాయలకి వెళ్ళి వచ్చి గేటు తీసుకుని మా వాటా వైపు వెడుతుండగా ఒక రెండేళ్ళ పాప పరుగులు పెట్టుకుంటూ వచ్చి "ఆంటీ" అంటూ నా కాళ్ళకి చుట్టుకుంది. నాకు చాలా ఆశ్చర్యం వేసింది. అసలు ఏ కొత్తదనం లేకుండా అంత స్నేహంగా, ప్రేమగా మనుషుల్ని పలకరించడం పసిపిల్లలకి ఎలా తెలుసు అని ఆశ్చర్యపోయాను. ఆ పెద్ద కళ్ళల్లో వున్న నిర్మలత, గులాబీల్లాంటి బుగ్గలు, చిన్ని నోరు....నన్నెంతో ఆకర్షించాయి. కాని నా చుట్టూ నేను నిర్మించుకున్న యినుపగోడ పగలటం ఈసారి సాధ్యం కాదు.

మెల్లగా పాప చేతుల్ని తప్పించుకుని లోపలికి వెడుతుండగా ఒకావిడ "బొత్తిగా పిల్లలంటే యిష్టం లేనట్టుందమ్మా ఆవిడకి. పాపం...చిన్నపిల్ల బిక్కమొహం వేసింది. అందుకే దేవుడు...." అంటోంది. చివరి మాటలు సరిగ్గా విన్పించలేదు. బహుశ "అందుకే దేవుడు పిల్లల్ని యివ్వకుండా గొడ్రాల్ని చేశాడు" అని వుండొచ్చు. నా కళ్ళల్లో నీటి పొర కదిలింది. మానుతున్న గాయం కెలికినట్టయ్యింది.

లోకం ఎన్ని రకాలు?! కడుపు నిండా తిండి సంపాదించుకుంటున్న వాణ్ణి స్వార్థపరుడు అంటుంది. కడుపు నిండా తిండి సంపాదించుకోలేని వాణ్ణి చేతకానివాడు అంటుంది. మనిషిని మనిషిగా జీవించనివ్వదు ఈ లోకం. □

—జయ




## సప్తపది

(నవల)

రచయిత్రి: కవిత; ప్రచురణ: ఎమ్. శేషాచలం అండ్ కో., మచిలీపట్నం, సికింద్రాబాద్; పేజీలు: 156 వెల: రూ. 3-50

## పారిజాతం

(నవల)

రచయిత్రి: రెడ్డి స్వరాజ్యలక్ష్మి; ఎమ్. శేషాచలం అండ్ కో., మచిలీపట్నం, సికింద్రాబాద్; పేజీలు: 144 వెల: రూ. 3-50

## ఇదే న్యాయం

(నవల)

రచయిత్రి: డా॥ కె. వి. కృష్ణకుమారి; ప్రచురణ: ఎమ్. శేషాచలం అండ్ కో., మచిలీపట్నం, సికింద్రాబాద్; పేజీలు: 128 వెల: రూ. 3-50

## పంకజం

(నవలికలు)

రచయిత్రి: వి. ఎస్. రమాదేవి; ప్రచురణ: నవోదయ పబ్లిషర్స్, విజయవాడ-2, గుంటూరు-2 ఈ పుస్తకంలో పంకజం, తల్లీబిడ్డలు అనే రెండు నవలికలు వున్నాయి. మొదటి ప్రచురణ 1961లో వెలువడిన ఈ పుస్తకానికి ఇది రెండవ ప్రచురణ: పేజీలు: 208; వెల: రూ. 10-00.

## సంగీత రత్నమాల

రచయిత్రి: కాకుటూరి పద్మావతి; ప్రతులకు: కె. పద్మావతి, కస్తూర్బా బిల్డింగ్స్; క్రిష్ణనగర్, చిలకలపూడి పోస్ట్, మచిలీపట్నం - 2, ఎమ్. శేషాచలం అండ్ కో., జగన్నాథపురం, మచిలీపట్నం-2; పేజీలు: 341; వెల: రూ. 20-00

## ఇక్కడికి స్వర్గ మెంతదూరం!

(నవల)

రచయిత్రి: విమలారామం; ప్రచురణ: ఎమ్. శేషాచలం అండ్ కో., మచిలీపట్నం, సికింద్రాబాద్; పేజీలు: 163; వెల: రూ. 3-50